
సాక్షి
పల్నాడు

బుధవారం, 3, సెప్టెంబర్, 2025



పేకాటరాయుళ్లు అరెస్టు


యడ్లపాడు: కోట గ్రామంలోని గోపీనాథ ఆలయ ప్రాంగణంలో పేకాట జరుగుతుందని తెలిసి ఎస్‌ఐ టి.శివరామకృష్ణ దాడి చేశారు. ముగ్గురిని అరెస్టు చేసి నగదు స్వాధీనం చేసుకున్నారు.



పులిచింతల ప్రాజెక్టు సమాచారం

అచ్చంపేట: పులిచింతల ప్రాజెక్టుకు ఎగువ నుంచి 2,58,320 క్యూసెక్కులు వచ్చి చేరుతుంది. ప్రాజెక్టు నుంచి దిగువకు 2,43,308 క్యూసెక్కులు వదులుతున్నారు.

వైభవంగా గణేష్ నిమజ్జనోత్సవం



కారెంపూడి: ఎన్‌ఎస్‌పీ కాలనీ వినాయకుడి గుడి ఆవరణలో ఏర్పాటు చేసిన గణేష్ విగ్రహం నిమజ్జన ఉత్సవం మంగళవారం వైభవంగా జరిగింది. అనంతరం భారీ అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

న్యూస్‌రీల్

ఆదివారం అమ్మవారి ఆలయం మూసివేత



దుగ్గిరాల: కంఠంరాజు కొండూరులోని మహంకాళీ అమ్మవారి ఆలయాన్ని ఆదివారం చంద్రగ్రహణం కారణంగా మధ్యాహ్నం 2:30 గంటల నుంచి మూసివేయనున్నట్టు ఈఓ కె.సునీల ఓ ప్రకటనలో తెలిపారు. తిరిగి సంప్రోక్షణ అనంతరం సోమవారం ఉదయం 9 గంటల నుంచి అమ్మవారి దర్శనం ప్రారంభమవుతుందని పేర్కొన్నారు.

గణనాథుడికి 117 రకాల ప్రసాదాలు



మంగళగిరి టౌన్: మంగళగిరి ఇప్పటం రోడ్డులో లక్ష్మీ గణపతి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విఘ్నేశ్వరుడికి సోమవారం రాత్రి 117 రకాల ప్రసాదాలు సమర్పించారు. స్థానిక చిన్నారులకు, మహిళలకు మ్యూజికల్ చైర్స్, స్పూన్ అండ్ లెమన్, క్విజ్ పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. చిన్నారుల నృత్య, కోలాట ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి. భక్తులు భారీ సంఖ్యలో గణపతిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

మెడికల్ విద్యార్థినికి చేయూత



మంగళగిరి టౌన్ : ఎంబీబీఎస్‌లో సీటు సాధించిన వెనిగళ్ళ సాహిత్యకు పట్టణ పద్మశాలీయ బహూత్తమ సంఘం చేయూతనిచ్చింది. మంగళగిరి నగర పరిధిలోని దామర్ల నాంచారమ్మ ప్రాంగణంలో ఉన్న పట్టణ పద్మశాలీయ బహూత్తమ కార్యాలయంలో విద్యార్థిని సాహిత్యకు రూ.70 వేలు నగదును అందజేశారు. ఈ సందర్భంగా పలువురు సంఘ నాయకులు మాట్లాడుతూ విద్యార్థినిలో ప్రతిభను ప్రోత్సహించడం సంఘం ముఖ్య ఉద్దేశమని అన్నారు. విద్యలో మరింత రాణిస్తూ ఉన్నత స్థాయికి చేరుకుని సమాజానికి, సామాజిక వర్గానికి మంచిపేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. సంఘ నాయకులు దామర్ల కుబేరస్వామి, గుత్తికొండ ధనుంజయరావు, రామనాథం పూర్ణచంద్రరావు, రవీంద్రనాథ్ తదితరులు పాల్గొన్నారు.

బార్ల నిర్వహణకు రీ నోటిఫికేషన్

నెహ్రూనగర్ (గుంటూరు ఈస్ట్): గుంటూరు జిల్లాలో ఉన్న 110 మద్యం బార్ల నిర్వహణకు గత నెలలో నోటిఫికేషన్ ఇచ్చిన విషయం తెలిసిందే. అయితే ఇందులో కేవలం 43 మద్యం బార్లకు మాత్రమే లాటరీ తీశారు. మిగిలిన వాటికి దరఖాస్తులు రాకపోవడంతో తిరిగి మంగళవారం రీ నోటిఫికేషన్ జారీ చేస్తూ ఎక్సైజ్ శాఖ కమిషనర్ నిశాంత్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నెల 3వ తేదీ నుంచి 14 వరకు దరఖాస్తుల స్వీకరణ, 15న లాటరీ ప్రక్రియ ఉంటుందని పేర్కొన్నారు.

పల్నాడులో ఆర్టీసీ కార్గో సేవలు విస్తృతం చేయాలి



నరసరావుపేట: పల్నాడు జిల్లాలో కార్గో సేవలను మరింతగా అభివృద్ధి చేయాలని డిప్యూటీ సీటీఎం (మార్కెటింగ్) పి.శేషగిరిరావు అన్నారు. మంగళవారం స్థానిక డిపోలోని ప్రజారవాణా అధికారి కార్యాలయంలో జిల్లాలో కార్గో సేవలు అందజేస్తున్న నరసరావుపేట, పిడుగురాళ్ల, సత్తెనపల్లి, చిలకలూరిపేట డిపో మేనేజర్లతో ఆయన సమావేశం నిర్వహించారు. జిల్లా ప్రజారవాణా అధికారి అజిత్‌కుమారి, ట్రాఫిక్ ఇన్‌చార్జిలు పాల్గొన్నారు.



చిలకలూరిపేట భాస్కర్ సెంటర్‌లో డాక్టర్ వైఎస్సార్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి విడదల రజిని



శావల్యాపురం మండలం కనమర్లపూడిలో వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు



మాచర్ల బస్టాండ్ సెంటర్‌లో వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న పార్టీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి సతీమణి రమా

సంక్షేమ ప్రదాత సదా స్మరామీ

వాడవాడలా ఘనంగా వైఎస్సార్ వర్ధంతి

- జిల్లా వ్యాప్తంగా దివంగత మహానేత డాక్టర్ వైఎస్సార్ వర్ధంతి కార్యక్రమాలు
- రాజన్న విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు
- సేవా కార్యక్రమాలు నిర్వహించిన వైఎస్సార్ సీపీ నేతలు, కార్యకర్తలు, అభిమానులు



సాక్షి, నరసరావుపేట: దివంగత ముఖ్యమంత్రి, మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతి కార్యక్రమాలు పల్నాడు జిల్లావ్యాప్తంగా నిర్వహించారు. వైఎస్సార్ సీపీ మాజీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇతర ముఖ్యనేతలు, కార్యకర్తల ఆధ్వర్యంలో వైఎస్సార్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. సేవా కార్యక్రమాలలో భాగంగా అన్నదానాలు, వస్త్రదానాలు చేశారు. రక్తదాన శిబిరాలు నిర్వహించారు.

ప్రజల గుండెల్లో సజీవం

మహనీయులకు మరణం ఉండదని, ప్రజల గుండెల్లో మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి ఎప్పటికీ కొలువై ఉంటారని మాజీ మంత్రి విడదల రజిని తెలిపారు. మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతిని పురస్కరించుకొని చిలకలూరిపేట పట్టణంలోని ఎన్‌ఆర్‌టీ రోడ్డులో ఉన్న మాజీ మంత్రి నివాస ప్రాంగణంలో ఏర్పాటు చేసిన డాక్టర్ వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం భారీబైక్ ర్యాలీగా బయలుదేరి భాస్కర్ సెంటర్‌లోని డాక్టర్ వైఎస్సార్, మాజీ ఎమ్మెల్యే సోమేపల్లి సాంబయ్య విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అక్కడే అన్నదాన కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా విడదల రజిని మాట్లాడుతూ ఫీజు రీయింబర్స్‌మెంట్, రుణమాఫీ, ఉచిత విద్యుత్, ఆరోగ్యశ్రీ, 108, 104, ఇందిరమ్మ ఇళ్లు వంటి ఎన్నో పథకాలను వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రవేశపెట్టి చరిత్రలో నిలిచిపోయారని గుర్తుచేశారు.

అభివృద్ధి ప్రదాత

2004 నుంచి 2009 వరకు చేసిన అభివృద్ధిని చూసి రాష్ట్ర ప్రజలు ఓటు వేయాలని గర్వంగా చెప్పి రెండవసారి కూడా ముఖ్యమంత్రి అయిన ఘనత దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డికే దక్కిందని గురజాల మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి అన్నారు. పిడుగురాళ్లలో జరిగిన వైఎస్సార్ వర్ధంతి కార్యక్రమంలో కాసు మహేష్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ముందుగా పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద ఉన్న వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అక్కడ బిర్యానీ పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం పట్టణంలోని అంజిరెడ్డి హాస్పటల్ వద్ద ఉన్న వైఎస్సార్ భారీ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు.



నరసరావుపేటలో మహానేత వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న వైఎస్సార్ సీపీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి

వైఎస్సార్ ఆశయ సాధనకు కృషి

వినుకొండ పట్టణంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో వైఎస్సార్ చిత్రపటానికి పార్టీ పీఏసీ మెంబరు, వినుకొండ మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా బొల్లా మాట్లాడుతూ మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి ఆరోగ్య శ్రీ, ఫీజు రీయింబర్స్‌మెంట్, జలయజ్ఞం, 108, 104 వంటి సంక్షేమ పథకాలు అమలు చేసి ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచారన్నారు. ఆయన ఆశయాలకు అనుగుణంగా వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన సాగించారన్నారు.

వ్యవసాయాన్ని పండుగ చేశారు

అభివృద్ధి, సంక్షేమ పథకాల ప్రదాత, వ్యవసాయాన్ని పండుగ చేసిన మహానేత, దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి బాటలోనే నడచి ఆయన ఆశయాలను వైఎస్సార్ సీపీ ముందుకు తీసుకెళ్తుందని పెదకూరపాడు మాజీ ఎమ్మెల్యే నంబూరు శంకరరావు అన్నారు. మంగళవారం దివంగత ముఖ్యమంత్రి, డాక్టర్ వైఎస్ రాజశేఖర రెడ్డి వర్ధంతి సందర్భంగా క్రోసూరు నాలుగు రోడ్ల కూడలిలోని వైఎస్సార్ విగ్రహానికి శంకరరావు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. మాజీ సీఎం వైఎస్ జగన్ ఆధ్వర్యంలో మహానేత ఆశయాలను సాధిస్తామని నంబూరు శంకరరావు అన్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు.

మాట తప్పని.. మడమ తిప్పని నేత

పేదల సంక్షేమానికి కట్టుబడి జనరంజక పాలన అందించిన దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచి ఉంటారని వైఎస్సార్ సీపీ సత్తెనపల్లి సమన్వయకర్త డాక్టర్ గజ్జల సుధీర్ భార్గవ్ రెడ్డి అన్నారు. దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర రెడ్డి వర్ధంతి మంగళవారం సత్తెనపల్లి నియోజకవర్గవ్యాప్తంగా వాడవాడలా నిర్వహించారు. రాజశేఖరరెడ్డి విగ్రహాలకు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పలు చోట్ల అన్న సంతర్పణలు నిర్వహించారు. మాట తప్పని, మడమ తిప్పని నాయకుడు వైఎస్సార్ అని గజ్జల కొనియాడారు.

పేదల సంక్షేమానికి తపించారు

పేదల గుండెల్లో వైఎస్సార్ చిరస్థాయిగా నిలిచిపోయారని, అటువంటి మహనీయుడికి ఘన నివాళులర్పించటం ప్రతి ఒక్కరి బాధ్యత అని వైఎస్సార్ సీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి సతీమణి రమా అన్నారు. మంగళవారం మాచర్ల నియోజక వర్గంలోని పట్టణంలోని బస్టాండ్ ప్రాంతంలోని దివంగత సీఎం వైఎస్సార్ వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పిన్నెల్లి రామకృష్ణారెడ్డి సతీమణి రమా, పలువురు నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో పేదల సంక్షేమం కోసం తపించిన మహనీయుడు వైఎస్సార్ అన్నారు. ఆయన ప్రతి పేద కుటుంబాన్ని ఆదుకునే లక్ష్యంతో ఎన్నో సంక్షేమ పథకాలు చేపట్టి ప్రజలకు ఎంతో మేలు చేసిన మహనీయుడిగా వారి మనసుల్లో చిరస్థాయిగా నిలిచారన్నారు.

ఆదర్శ నాయకుడు

ఆదర్శవంతమైన పరిపాలన అందించి పాలకులకు స్ఫూర్తి నిచ్చిన నాయకుడు దివంగత వైఎస్ రాజశేఖరరెడ్డి అని వైఎస్సార్ సీపీ పల్నాడు జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. వైఎస్సార్ వర్ధంతిని పురస్కరించుకొని నరసరావుపేట నియోజకవర్గ వ్యాప్తంగా పార్టీ శ్రేణులు పలు కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. పార్టీ జిల్లా కార్యాలయంలో వందలాది పార్టీ శ్రేణుల మధ్య గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి వైఎస్సార్ ప్రతిమకు పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు బ్రెడ్లు, పండ్లు పంపిణీ చేశారు. పట్టణంలోని రామిరెడ్డిపేట సెంటర్‌లోని వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పించారు. అక్కడ సుమారు మూడు వేలమందికి అన్నదానం నిర్వహించారు.



పిడుగురాళ్ల రైల్వేస్టేషన్ రోడ్డులో మహానేత వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పించి మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి



సత్తెనపల్లి తాలూకా సెంటర్‌లో వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న సమన్వయకర్త డాక్టర్ గజ్జల సుధీర్ భార్గవ్‌రెడ్డి



క్రోసూరు నాలుగురోడ్ల జంక్షన్‌లో మహానేత వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పించి మాట్లాడుతున్న పెదకూరపాడు మాజీ ఎమ్మెల్యే నంబూరు శంకరరావు

ఎరువుల అక్రమ రవాణాను సహించం

- జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు
- కారెంపూడిలో ఎరువుల దుకాణాల గోడౌన్లలో తనిఖీలు

కారెంపూడి: పల్నాడు జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు కారెంపూడి మండలంలో మంగళవారం పర్యటించారు. కారెంపూడిలో ఎరువుల దుకాణాల గోడౌన్లలో స్టాకును తనిఖీ చేశారు. సరిహద్దు ప్రాంతాల నుంచి ఇతర రాష్ట్రాలకు ఎరువుల అక్రమ రవాణా జరగకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. ఎరువుల సరఫరా, రవాణా, నిల్వ, విక్రయాలకు సంబంధించిన అక్రమాలలో భాగస్వాములయ్యేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. స్టాకు రిజిష్టర్లు ఈ పాస్ మిషన్లలో ఉన్న ప్రకారం స్టాకు నిల్వలుండాలన్నారు. తప్పని సరిగా స్టాకు నిల్వల బోర్డులు రైతులకు అందుబాటులో ఉంచాలన్నారు.

వ్యవసాయ పనులు ముమ్మరంగా జరుగుతున్న తరుణంలో రైతులకు సరిపడా అన్ని రకాల ఎరువులు అందించాల్సిన బాధ్యత ఉందన్నారు. ఏ ఎరువు కూడా కొరత రాకూడదని కొంచెం నిల్వలుండగానే ఇండెంటు పెట్టుకోవాలని సూచించారు. ముందుగా ఒప్పిచర్ల జెడ్పీ హైస్కూల్ తరగతి గదికి వెళ్లి బోధన తీరును పరిశీలించారు. డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం ఆహారాన్ని పరిశీలించారు. అనంతరం కారెంపూడి పీహెచ్‌సీని సందర్శించి, డాక్టర్లు, సిబ్బంది రికార్డులను తనిఖీ చేశారు. ఆసుపత్రి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. గురజాల ఆర్డీఓ మురళీకృష్ణ, డీఈఓ చంద్రకళ, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి జగ్గారావు, డీఎంహెచ్‌ఓ రవి, తహసీల్దార్ వెంకటేశ్వర్లు నాయక్, ఎస్‌ఐ వాసు ఉన్నారు.



ఎరువుల నిల్వల రికార్డులు పరిశీలిస్తున్న కలెక్టర్

పీఎంజేఏవైతో రూ.5 లక్షల ఆరోగ్య బీమా

జిల్లా ఆరోగ్యశ్రీ అధికారి చంద్రశేఖర్

ముప్పాళ్ల: ప్రధానమంత్రి జన ఆరోగ్య యోజన పథకం(పీఎంజేఏవై) ద్వారా అర్హులైన వారందరికీ రూ.5 లక్షల వరకు ఆరోగ్యబీమా అందుతుందని జిల్లా ఆరోగ్యశ్రీ అధికారి డాక్టర్ జి.చంద్రశేఖర్ చెప్పారు. మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జరిగిన ఆశా డే కార్యక్రమంలో పాల్గొని క్షేత్రస్థాయిలో పీఎంజేఏవై పంపిణీలో తీసుకోవాల్సిన అంశాలపై మంగళవారం అవగాహన కల్పించారు. 70 సంవత్సరాలు పైబడిన వారికి ఆరోగ్య బీమా, హాస్పిటల్స్‌లో రాయితీలు ఉంటాయని, వృద్ధులకు ఈ కార్డు ఎంతగానో ఉపయోగపడుతుందని, అర్హులందరికీ అందేలా వైద్య సిబ్బంది చూడాలన్నారు. పీహెచ్‌సీ వైద్యాధికారి పి.రమాదేవి మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో గర్భిణులు, వృద్ధులకు, ప్రజలకు ఆరోగ్యసేవలను పొందేలా పనిచేయాలన్నారు. వర్షాకాలంలో వ్యాధులు ప్రబలకుండా ప్రతి ఆరోగ్య కార్యకర్త తమ పరిధిలోని గ్రామంలో ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలో కాన్పులు జరిగేలా కృషి చేయాలని ఆరోగ్య కార్యకర్తలకు సూచించారు.

జాతీయ నేతల విగ్రహాలకు సముచిత గౌరవం

సాక్షి ఎఫెక్ట్

పిడుగురాళ్ల: పిడుగురాళ్ల రైల్వే స్టేషన్ రోడ్డులోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల(జమునా స్కూల్)లో జాతీయ నాయకుల విగ్రహాలకు ఎట్టకేలకు మోక్షం లభించింది. మూలన పడిఉన్న వాటిని పాఠశాలలో తిరిగి ఏర్పాటు చేశారు. పునర్నిర్మాణంలో భాగంగా పాఠశాలలోని జాతీయ నాయకుల విగ్రహాలను పిచ్చి మొక్కల మధ్య పడేశారు. దీనిపై ఆగస్టు 15వ తేదీన 'మహనీయులకు ఇచ్చే గౌరవం ఇదేనా!' శీర్షికన 'సాక్షి'లో కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన జిల్లా విద్యాశాఖ అధికారి, పిడుగురాళ్ల ఎంఈఓ శ్రీనివాసరెడ్డికి ఆదేశాలు జారీచేయడంతో జాతిపిత మహాత్మా గాంధీ, జవహర్‌లాల్ నెహ్రూ, నేతాజీ సుభాష్ చంద్రబోస్, పొట్టి శ్రీరాములు విగ్రహాలను పాఠశాలలో చక్కటి వేదిక ఏర్పాటు చేయించి, పునర్నిర్మిస్తున్నారు. దీనిపై స్థానికులు 'సాక్షి' చొరవతో జాతీయ నాయకుల విగ్రహాలకు సముచిత గౌరవం దక్కిందని హర్షం వ్యక్తం చేశారు.



జమునా స్కూల్‌లో జాతీయ నాయకుల విగ్రహాల ఏర్పాటు చేస్తున్న దృశ్యం

బాలికను వేధించిన కేసులో నిందితునికి ఆరు నెలల జైలు

తీర్పు వెలువరించిన గుంటూరు జిల్లా కోర్టు

రాజుపాలెం: బాలికను వెంటపడి వేధిస్తున్న యువకుడికి ఆరు నెలలు జైలు శిక్ష, రూ.5000 జరిమానా విధిస్తున్నట్లు గుంటూరు జిల్లా కోర్టు తీర్పు వెలువరించినట్లు పల్నాడు జిల్లా ఎస్పీ కె.శ్రీనివాసరావు మంగళవారం తెలిపారు. మండలంలోని అనుపాలెంకు చెందిన పిడతల శ్యామ్ 2021లో 10వ తరగతి చదువుతున్న బాలికను వేధిస్తున్నాడని ఆమె తండ్రి ఫిర్యాదు చేశారు. దీంతో అప్పటి ఎస్‌ఐ అమీర్ కేసు నమోదు చేసి విచారణ నిమిత్తం కోర్టులో ఛార్జిషీట్ దాఖలు చేశారు. ప్రస్తుత సత్తెనపల్లి డీఎస్పీ ఎం. హనుమంతరావు పర్యవేక్షణలో రాజుపాలెం ఎస్‌ఐ కె.వేణుగోపాల్ ఆధ్వర్యంలో సాక్షులను హాజరు పరుచగా విచారించిన పీటీసీఎస్‌ఓ గుంటూరు జిల్లా కోర్టు జడ్జి షమీపర్వీన్ సుల్తాన్‌బేగం శిక్షను విధించారు.

క్లుప్తంగా

పోలీసుల అదుపులో మట్కా నిందితులు

నరసరావుపేటటౌన్: నిషేధిత మట్కా నిర్వాహకులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నరసరావుపేటలో కొన్ని నెలలుగా టీడీపీ నాయకులు నిషేధిత లాటరీ, మట్కా వ్యాపారాన్ని కొనసాగిస్తున్నారు. ఇటీవల కాలంలో యథేచ్ఛగా అక్రమ వ్యాపారాన్ని నిర్వహిస్తున్నారు. దీనిపై ఫిర్యాదులు రావటంతో జిల్లా ఎస్పీ కె.శ్రీనివాసరావు ఆదేశాల మేరకు ఇన్‌చార్జి డీఎస్పీ కె.హనుమంతరావు ప్రత్యేక సిబ్బందిని ఏర్పాటు చేశారు. పదిరోజులుగా నరసరావుపేటలోని పలు ప్రాంతాల్లో దాడులు నిర్వహించి మట్కా జూదం నిర్వహిస్తున్న పలువురిని అదుపులోకి తీసుకున్నారు. అదే విధంగా నిషేధిత లాటరీ విక్రేతలను అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి లాటరీ నంబర్ల స్లిప్‌లను స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. పోలీసుల అదుపులో ఉన్న నిందితులను వన్‌టౌన్, టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లకు తరలించి వారిని రహస్యంగా విచారిస్తున్నారు. నిందితులు ఇచ్చిన సమాచారంతో అసలైన సూత్రదారులను అరెస్ట్ చేసేందుకు రంగం సిద్ధం చేసినట్లు తెలియవచ్చింది.

పేదల మనిషి డాక్టర్ వైఎస్సార్



గుంటూరురూరల్: మండలంలోని 41వ డివిజన్‌నందున్న అడవి తక్కెళ్లపాడు గ్రామం, రాజీవ్ గృహకల్పలో జరిగిన దివంగత మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతి కార్యక్రమంలో మాజీ హోంమంత్రి మేకతోటి సుచరిత పాల్గొని డాక్టర్ వైఎస్సార్ విగ్రహాలకు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆమె మాట్లాడుతూ గొప్ప మనసున్న మహారాజు, అపర భగీరథుడు, ఆరోగ్యశ్రీ ప్రదాత, ప్రజాసేవలోనే అశువులు బాసిన గొప్ప మహనీయులు మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి అని కొనియాడారు. అనంతరం గ్రామంలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాలను ప్రారంభించారు. గ్రామస్తులు మాజీ మంత్రిని సత్కరించారు. వైఎస్సార్ సీపీ నాయకులు పిల్లి మేరి, వెంకట్, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

అమరావతిలో పర్యటించిన 'యూనివర్సిటీ ఆఫ్ టోక్యో' బృందం

తాడికొండ: జపాన్‌కు చెందిన 'యూనివర్సిటీ ఆఫ్ టోక్యో' బృందం మంగళవారం అమరావతిలో పర్యటించింది. తొలుత ఆ బృందం అమరావతిలోని శాఖమూరు పరిసర ప్రాంతాలను సందర్శించింది. అమరావతిలో యూనివర్సిటీ ఏర్పాటుకు అనుకూలమైన భూములను డ్రోన్, మ్యాప్ సహాయంతో సీఆర్డీఏ అడిషనల్ కమిషనర్ జి.సూర్యసాయి ప్రవీణ్‌చంద్ వివరించారు. రాజధాని అమరావతిలో విద్యాసంస్థల ఏర్పాటుకు అనుకూలమైన సదుపాయాలు అందుబాటులో ఉన్నాయని జపాన్ బృందం సంతృప్తి వ్యక్తం చేసినట్లు సీఆర్డీఏ అధికారులు తెలిపారు. అనంతరం బృందం అమరావతిలో విట్, ఎస్ఆర్ఎం యూనివర్సిటీ క్యాంపస్‌లను సందర్శించింది. బృందంలో టోక్యో వర్సిటీ అసోసియేట్ ప్రొఫెసర్ యోషియుకి కజాయో, ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్, ప్రొఫెసర్ హయాషి కయోరి ఉన్నారు.

టెన్నికాయిట్ జిల్లా జట్ల ఎంపిక



ఎంపికైన క్రీడాకారులతో సెలక్షన్ కమిటీ సభ్యులు

నరసరావుపేట రూరల్: ఉమ్మడి గుంటూరు జిల్లా టెన్నికాయిట్ సీనియర్ స్త్రీ, పురుషుల జట్ల ఎంపిక పోటీలు లింగంగుంట్ల శంకరభారతీపురం జెడ్పీ హైస్కూల్‌లో మంగళవారం నిర్వహించారు. ప్రతిభ కనబర్చిన క్రీడాకారులతో ఇరు జట్లను ఎంపిక చేశారు. పురుషుల జట్టులో డి.కోటేశ్వరరావు, పి.ఆంజనేయులు(నకరికల్లు), ఆర్.సాయిగణేష్, వి.వీరతేశ్వర్ (శంకరభారతీపురం జెడ్పీ హైస్కూల్), మహిళల జట్టులో జె.సిరివల్లి, టి.నవ్య(కేజీబీవీ, నాదెండ్ల), బి.వైశాలి(నకరికల్లు), బి.రాజ్యలక్ష్మి (రాజుపాలెం)లు ఎంపికయ్యారు. ఎంపికైన జట్లు ఈనెల 13, 14వ తేదీలలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా మండపేటలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలలో పాల్గొంటారు. పోటీలను అసోసియేషన్ అధ్యక్షుడు నిడికొండ జానకీరామయ్య పర్యవేక్షించారు. సెలక్షన్ కమిటీ సభ్యులుగా పి.తిరుపతిరావు, సిహెచ్ పుల్లయ్య, జి.ఝాన్సీరాణి, ఎన్.రాణి, పి.రమాదేవిబాయ్, లక్ష్మీతిరుపతమ్మలు వ్యవహరించారు.

జిల్లా కోర్టులో ఘనంగా వైఎస్సార్ వర్ధంతి



గుంటూరు జిల్లా కోర్టులో జరిగిన కార్యక్రమంలో వైఎస్సార్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి, జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబు, న్యాయవాదులు

గుంటూరు లీగల్: గుంటూరు జిల్లా కోర్టులో వైఎస్సార్ సీపీ జిల్లా లీగల్ సెల్ ఆధ్వర్యంలో దివంగత మహానేత డాక్టర్ వై.ఎస్.రాజశేఖర రెడ్డి వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్ వైఎస్సార్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అల్పాహార విందును ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో పార్టీ గుంటూరు జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబు పాల్గొని మహానేత చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో గుంటూరు జిల్లా లీగల్ సెల్ అధ్యక్షుడు సిడి భగవాన్, రాష్ట్ర లీగల్ సెల్ కార్యదర్శి పోలూరి వెంకటరెడ్డి, మాజీ గవర్నమెంట్ ప్లీడర్లు పోకల వెంకటేశ్వర్లు, ఎంవీ సుబ్బారెడ్డి, మాజీ ఏజీపీ సౌభాగ్య లక్ష్మి, మాజీ అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్లు వట్టిజొన్నల బ్రహ్మారెడ్డి, కాసు వెంకటరెడ్డి, వాసం సూరిబాబు, వజ్రాల రాజశేఖర్ రెడ్డి, మాతంగి శ్రీకాంత్, కేవీ రమణారెడ్డి, సోమసాని ఝాన్సీ, బడి మంజుల, గేర వెంకట సుబ్బారావు, బొడ్డు కోటేశ్వరరావు, బూదాటి సాగర్, లీగల్ సెల్ అధికార ప్రతినిధి సయ్యద్ బాబు, మాజీ మున్సిపల్ స్టాండింగ్ కౌన్సిల్ సుధాకర్ రెడ్డి, న్యాయవాదులు కృష్ణారెడ్డి, సుదర్శన క్రాంతి కుమార్ బొమ్మనబోయిన శ్రీనివాస్, నల్లక వెంకట వేణు, సురేష్, నగర యువజన విభాగం అధ్యక్షుడు ఏటి కోటేశ్వరరావు, పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు.

ఆర్ఓబీకి ముందే ఆర్‌యూబీ నిర్మించాలి

- ప్రజారవాణాకు ఇబ్బందులు లేకుండా చూడాలి
- నష్టపరిహారం చెల్లించకుండా భవన యజమానులను ఖాళీ చేయాలని బెదిరించడం అధికారులకు తగదు
- మీడియా సమావేశంలో బెటర్ శంకర విలాస్ ఫ్లయ్ ఓవర్ సాధన జేఏసీ కన్వీనర్ ఎల్.ఎస్.భారవి



సమావేశంలో మాట్లాడుతున్న జేఏసీ కన్వీనర్ ఎల్.ఎస్.భారవి

గుంటూరు ఎడ్యుకేషన్: శంకర్‌విలాస్ నూతన ఫ్లయ్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణ పనులను చేపట్టే ముందుగానే ప్రజా రవాణాకు వీలుగా రైల్వే అండర్ బ్రిడ్జి (ఆర్‌యూబీ)ని చేపట్టాలని బెటర్ శంకర్ విలాస్ ఫ్లయ్ ఓవర్ సాధన జేఏసీ కన్వీనర్ ఎల్ఎస్ భారవి డిమాండ్ చేశారు. మంగళవారం గుంటూరులోని ఓ హోటల్‌లో జరిగిన మీడియా సమావేశంలో భారవి మాట్లాడుతూ ఇటీవల జరిగిన నగరపాలకసంస్థ కౌన్సిల్ సమావేశంలో ఫ్లయ్ ఓవర్ నిర్మాణానికి ముందే ఆర్‌యూబీ నిర్మించాలని చేసిన తీర్మానాన్ని ప్రభుత్వానికి పంపి ఆమోదింపచేయాలని విజ్ఞప్తి చేశారు. కేంద్ర ప్రభుత్వం నుంచి ఆర్‌యూబీ నిర్మాణానికి నిధులు తెచ్చిన కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ ఆర్‌యూబీ నిర్మాణం దిశగా రైల్వేశాఖను ఒప్పించాలని కోరారు. శంకర్‌విలాస్ ఫ్లయ్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణ పనులను ప్రారంభించే అర్నెల్ల పాటు బ్రిడ్జిపై వాహనాలు యధావిధిగా రాకపోకలు సాగించవచ్చని జిల్లా కలెక్టర్ స్వయంగా ప్రకటించిన రెండు నెలల వ్యవధిలోనే బ్రిడ్జి కూల్చివేత పనులు ప్రారంభించేశారని చెప్పారు.

– బ్రిడ్జికి రెండు వైపులా కూల్చివేసిన ఆర్అండ్‌బీ శాఖాధికారులు రైల్వే పరిధిలోని బ్రిడ్జి కూల్చివేత పనులకు అనుమతుల కోసం తీరిగ్గా రైల్వేబోర్డు దృష్టికి తీసుకెళ్లడం ముందుచూపు లోపించిన పనులకు నిదర్శనమన్నారు. అన్ని అనుమతులు తెచ్చిన తరువాతే బ్రిడ్జి కూల్చివేత, నిర్మాణ పనులు చేపట్టాల్సిన అధికార యంత్రాంగం రైల్వేబోర్డు అనుమతి కోసం పంపడం ద్వారా నూతన బ్రిడ్జి నిర్మాణాన్ని మరింతగా జాప్యం చేయడమేనన్నారు. బ్రిడ్జి నిర్మాణం కారణంగా నష్టపోతున్న భవన యజమానులకు చట్ట ప్రకారం నష్ట పరిహారాన్ని చెల్లించాలని హైకోర్టు స్పష్టంగా చెప్పడంతోపాటు స్టేటస్–కో విధించినప్పటికీ అధికార యంత్రాంగం ఖాతరు చేయకుండా ఏకపక్షంగా పనులు చేపడుతున్నారని ఆరోపించారు. హైకోర్టులో స్టే ఉండగానే రెండు రోజుల్లో భవనాలు ఖాళీ చేయాలని నోటీసులు జారీ చేయడమేంటని ప్రశ్నించారు. నగర ప్రజలపై గౌరవం లేని అధికారులు కనీసం హైకోర్టుపై గౌరవంతో ఆదేశాలను పాటించాలని కోరారు.

– నగర ప్రజలతో పాటు నిర్మాణాలను కోల్పోతున్న యజమానుల ఆకాంక్షలను దృష్టిలో ఉంచుకుని అన్ని అనుమతులు తెచ్చుకుని బ్రిడ్జి కూల్చివేత, నిర్మాణ పనులు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఆర్‌యూబీ నిర్మాణానికి నిధుల గురించి ప్రజా ప్రతినిధులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ఆర్‌యూబీ నిర్మాణాన్ని రైల్వేశాఖ చేపడుతుందని చెప్పారు. సమావేశంలో షాప్ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు బెల్లంకొండ శ్రీనివాసరావు, కమల్‌కాంత్, అవధానుల హరి, వల్లూరి సదాశివరావు పాల్గొన్నారు.

10న నాయుడమ్మ అవార్డు ప్రదానం



తెనాలి: తెనాలికి చెందిన ప్రముఖ శాస్త్రవేత్త డాక్టర్ యలవర్తి నాయుడమ్మ స్మారక అవార్డును ఆయన జన్మదినమైన ఈనెల పదో తేదీన ప్రదానం చేయనున్నారు. డాక్టర్ యలవర్తి నాయుడమ్మ సైన్స్ అండ్ టెక్నాలజీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరిగే కార్యక్రమ వివరాలను మంగళవారం సాయంత్రం ఇక్కడి కుమార్ పంప్స్ సమావేశ మందిరంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఫౌండేషన్ నిర్వాహకులు ఆహ్వానపత్రికను ఆవిష్కరించారు. వివరాలను తెలియజేశారు. తెనాలి రామకృష్ణకవి కళాక్షేత్రంలో ఆరోజు సాయంత్రం 4.30 గంటలకు జరిగే సభలో భారత ప్రభుత్వ ఆర్థిక మంత్రిత్వశాఖలో ఫైనాన్షియల్ సర్వీసెస్ కార్యదర్శిగా చేస్తున్న ఐఏఎస్ అధికారి నాగరాజు మద్దిరాలకు నాయుడమ్మ అవార్డును బహూకరిస్తామని ఫౌండేషన్ అధ్యక్షుడు యడ్లపాటి రఘునాథబాబు తెలిపారు. తెలంగాణ రాష్ట్ర గవర్నర్ శ్రీజిష్ణుదేవ్ వర్మ చేతులమీదుగా ఈ అవార్డును ప్రదానం చేస్తామని చెప్పారు. అవార్డు ప్రదానోత్సవ సభను జయప్రదం చేయాలని ఉపాధ్యక్షుడు కొత్త సుబ్రహ్మణ్యం కోరారు. విలేకరుల సమావేశంలో డాక్టర్ అయినాల మల్లేశ్వరరావు, కె.అరవింద్, కె.నందకిశోర్ పాల్గొన్నారు.

చురుగ్గా రేషన్ స్మార్ట్ కార్డుల పంపిణీ

మంత్రి నాదెండ్ల మనోహర్



అత్తోట(కొల్లిపర): రాష్ట్రంలో రేషన్ స్మార్ట్ కార్డుల పంపిణీ చురుగ్గా కొనసాగుతోందని పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ చెప్పారు. మంగళవారం గుంటూరు జిల్లా అత్తోటలో ఆయన స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు. మనోహర్ మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా 1.46 కోట్ల మందికి స్మార్ట్ కార్డులు అందిస్తున్నట్లు చెప్పారు. చౌక దుకాణాల ద్వారా 1 నుంచి 15వ తేదీ వరకు రేషన్ సరకులు అందిస్తామన్నారు. రాష్ట్రంలో ఎక్కడైనా రేషన్ తీసుకోవచ్చని చెప్పారు. చౌక దుకాణాలను రానున్న రోజుల్లో మినీ మార్ట్‌లుగా తీర్చిదిద్దుతామన్నారు. వీటి ద్వారా తక్కువ ధరకే ఆర్గానిక్, నిత్యావసర సరుకులు అందిస్తామని చెప్పారు. రైతుల నుంచి ప్రతి ధాన్యపు గింజను కొనుగోలు చేస్తామన్నారు. త్వరలో సబ్సిడీపై టార్పలిన్ పట్టాలు అందిస్తామన్నారు.

యూరియా అందడం లేదని రైతుల ఫిర్యాదు

తమకు యూరియా అందడం లేదని అత్తోట గ్రామ రైతులు మంత్రి నాదెండ్లకు ఫిర్యాదు చేశారు. ఆయన స్పందిస్తూ ఎరువుల విషయంలో రైతులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.


డీఆర్ఎం కార్యాలయంలో సోలార్ ప్లాంట్

ప్రారంభించిన డీఆర్ఎం సుథేష్ణ సేన్



లక్ష్మీపురం: గుంటూరు రైల్వే డివిజన్ కార్యాలయంలో సోలార్ ప్లాంట్‌ను ప్రారంభించడం సంతోషదాయకమని డివిజన్ డీఆర్ఎం సుథేష్ణ సేన్ అన్నారు. గుంటూరు పట్టాభిపురంలోని డీఆర్ఎం కార్యాలయ ప్రాంగణంలో మంగళవారం సోలార్ ప్లాంట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కార్యాలంలో రోజు వారీ విద్యుత్ వినియోగంలో గణనీయమైన భారాన్ని తీర్చడానికి సోలార్ ప్లాంట్‌ను రూపొందించడం జరిగిందన్నారు. అనంతరం ప్లాంట్ నిర్మాణం కోసం కృషి చేసిన సంబంధిత అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. ఏడీఆర్ఎం ఎం.రమేష్‌కుమార్, డివిజనల్ ఎలక్ట్రికల్ ఇంజినీర్ ఎం.రవితేజ, సీనియర్ డీసీఎం ప్రదీప్‌కుమార్, డివిజన్ అధికారులు పాల్గొన్నారు.

ఉత్తమ ప్రధానోపాధ్యాయురాలుగా యడ్ల సత్యవతి



బాపట్ల: బాపట్ల జిల్లాలో ఉత్తమ ప్రధానోపాధ్యాయురాలుగా యడ్ల సత్యవతి ఎంపికయ్యారు. ఏవీవీ హైస్కూలు ప్రధానోపాధ్యాయులుగా పనిచేస్తున్న యడ్ల సత్యవతిని ఉత్తమ ప్రధానోపాధ్యాయులుగా ఎంపిక చేయటంతో ఆజాద్ మున్సిపల్ మోడల్ ప్రైమరీ స్కూలు సిబ్బంది అభినందించారు.

జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడుగా వీరాంజనేయులు



బల్లికురవ: గురు పూజోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయుడుగా మండలంలోని కొప్పరపాలెం ఉన్నత పాఠశాల ఎస్జీటీ గాలం వీరాంజనేయులు ఎంపిక చేశారు. ఈమేరకు ఎంఈవో 1,2 శ్రీనివాసరావు, రమేష్‌బాబు మంగళవారం తెలిపారు. మండలంలోని వైదన గ్రామానికి చెందిన వీరాంజనేయులు 2008లో ఉపాధ్యాయ వృత్తిని చేపట్టి కూకట్లపల్లి, కొటావారిపాలెం, పాతమల్లాయపాలెంలోని పాఠశాలలో విద్యాభివృద్ధితోపాటు మౌలిక వసతుల కల్పనకు కృషి చేశారన్నారు. జిల్లాలో ఎంపికైన 33 మంది ఉత్తమ ఉపాధ్యాయుల్లో బల్లికురవ మండలానికి స్థానం దక్కిందన్నారు. ఎంఈవోలతోపాటు ఎంపీడీవో కుసుమ కుమారి, పాఠశాల హెచ్ఎం కోటినాగులు, వివిధ పాఠశాలల హెచ్ఎంలు ఉపాధ్యాయులు ఆయన్ను అభినందించారు.

మిర్చి యార్డు సమాచారం

(మంగళవారం ధరలు)

వచ్చిన బస్తాలు	53,093
అమ్మకాలు	50,840
నిల్వ	9,971

నాన్ ఏసీ కామన్ రకం క్వింటా (రూ.)

334	10,000-14,200
నంబరు-5	10,000-13,400
341	10,000-15,300

ఏసీ కామన్ రకం క్వింటా (రూ.)

334	10,500-14,300
నంబరు-5	10,000-13,500
341	11,000-15,500
4884	10,000-13,500

నాన్ ఏసీ ప్రత్యేక రకాలు క్వింటా (రూ.)

షార్క్-1	10,000 - 15,400
సంగీ బాడిగ 5531	10,000 - 14,600
ఆర్మూర్	9,800 - 12,500
తాలుకాయలు	6,200 - 7,800

ఏసీ ప్రత్యేక రకాలు క్వింటా (రూ.)

షార్క్-1	10,000 - 15,300
సంగీ బాడిగ 355	10,000 - 14,500
దువనూర్ డీలక్స	10,500 - 13,500
తాలు	5,400 - 7,500

–కొరిటిపాడు (గుంటూరు)

డీజిల్ దొంగ అరెస్ట్

- లారీలో డీజిల్ దొంగలిస్తుండగా పట్టుకున్న స్థానికులు
- టూటౌన్ పోలీసులకు అప్పగింత



డీజిల్ దొంగతనం చేస్తూ పట్టుబడ్డ యువకుడు



డీజిల్ దొంగిలించేందుకు తెచ్చిన క్యాన్‌లు

నరసరావుపేటటౌన్: ఆగి ఉన్న లారీల్లో డీజిల్ దొంగతనం చేస్తున్న యువకుడిని స్థానికులు పట్టుకొని పోలీసులకు అప్పగించిన సంఘటన మంగళవారం పట్టణంలో చోటుచేసుకుంది. టూటౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శివసంజీవయ్య కాలనీకి చెందిన కాకాని యశ్వంత్ చిలకలూరిపేట రోడ్డు ముస్లిం శ్మశానవాటిక పక్కన గల పెట్రోల్ బంకు ఆవరణలో నిలిపి ఉన్న లారీలో తెల్లవారుజామున డీజిల్ దొంగతనం చేసేందుకు ప్రయత్నించాడు. గమనించిన పెట్రోల్ బంకు సిబ్బంది కేకలు వేయటంతో తన వెంట తెచ్చుకున్న ద్విచక్రవాహనం, 25 లీటర్ల రెండు క్యాన్‌లు వదిలి పరారయ్యాడు. రెండు గంటల తర్వాత మరో ద్విచక్ర వాహనంపై అతని స్నేహితుడితో కలిసి వచ్చి వదిలి వెళ్లిన వాహనాన్ని తీసుకెళ్లాడు. అప్పటికే యశ్వంత్ కోసం అక్కడ వేచి చూస్తున్న లారీ యజమానులు, పెట్రోల్ బంకు నిర్వాహకులు అతన్ని పట్టుకున్నారు. సమాచారం అందుకున్న టూటౌన్ సీఐ హైమారావు సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకున్నారు. కొన్ని నెలలుగా లారీల్లో డీజిల్, బ్యాటరీలు అపహరణకు గురవుతున్నాయని లారీల నిర్వాహకులు పోలీసులకు వివరించారు. నిందితుడితోపాటు అతని స్నేహితుడిని అదుపులోకి తీసుకొని డీజిల్ దొంగతనం చేసేందుకు తెచ్చిన ప్లాస్టిక్ క్యాన్‌లను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ఉపాధ్యాయ నియామకాల్లో కూటమి ప్రభుత్వం అక్రమాలు

దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుబ్బారావు



మాట్లాడుతున్న సుబ్బారావు

నరసరావుపేట ఈస్ట్: డీఎస్సీ–2025 ఉపాధ్యాయ నియామకాలలో రాష్ట్ర ప్రభుత్వం అక్రమాలకు పాల్పడుతున్నదని దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కరువాది సుబ్బారావు తెలిపారు. అరండల్‌పేటలోని సీపీఐ కార్యాలయంలో మంగళవారం సాయంత్రం ఆయన మాట్లాడుతూ, మెగా డీఎస్సీలో ర్యాంక్‌లు వచ్చినా కాల్‌లెటర్‌లు రాని అభ్యర్థులు మెరుపు వేగంతో పోరాటానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఉపాధ్యాయ నియామకాలలో కూటమి ప్రభుత్వం మాయాజాలాన్ని ప్రదర్శిస్తూ రిజర్వేషన్ కోటాలో కోత కోస్తున్నదని తెలిపారు. మెరిట్ సాధించిన ఎస్సీ, ఎస్టీ, బీసీ అభ్యర్థులను ఓపెన్ కేటగిరి నుంచి రిజర్వేషన్ కోటాలోకి మార్చటం వలన నిజమైన రిజర్వేషన్ అభ్యర్థులు అనర్హులుగా మారి వందలాది పోస్టులను కోల్పోయారని వివరించారు. జీఓ 77 ప్రకారం రిజర్వేషన్లు వర్టికల్ పద్ధతిలో అమలు చేయాలని స్పష్టం చేసారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం రిజర్వేషన్ కోటా పోస్టులపై సరైన నిర్ణయం తీసుకొని అభ్యర్థులకు న్యాయం చేయాలని కోరారు. సమావేశంలో పోరాట సమితి జిల్లా కార్యదర్శి వైదన వెంకట్ పాల్గొన్నారు.

అర్ధరాత్రి కారు బీభత్సం

- అతివేగంగా వెళ్తూ పలు వాహనాలను ఢీకొట్టిన వైనం
- గాయపడిన పలువురు వ్యక్తులు
- కారుపై పోలీస్ స్టిక్కర్



మంగళగిరి ప్రకాశం బ్యారేజ్ రోడ్డులో ఐఓసీ వద్ద చెట్టును ఢీకొట్టి నిలిచిపోయిన కారు

తాడేపల్లి రూరల్: మంగళగిరి ప్రకాశం బ్యారేజ్ పాత జాతీయ రహదారిలో ఉండవల్లి సెంటర్ నుంచి మంగళగిరి వెళ్లే మార్గంలో సోమవారం అర్ధరాత్రి ఓ కారు బీభత్సం సృష్టించి పలుచోట్ల ద్విచక్ర వాహనదారులను, ఒక సైక్లిస్టును ఢీకొట్టి చివరకు ఒక చెట్టును ఢీకొని నిలిచిపోయింది. ప్రత్యక్ష సాక్షులు తెలిపిన వివరాల ప్రకారం.. సోమవారం అర్ధరాత్రి ఉండవల్లి సెంటర్ నుంచి మంగళగిరి వెళుతున్న పోలీస్ స్టిక్కర్ కలిగి వున్న ఒక కారు సాయిబాబా గుడివద్ద విజయవాడ నుంచి మంగళగిరి వెళ్తున్న ఆటోను ఢీకొట్టింది. ఆ ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న డ్రైవర్‌తోపాటు భార్యాభర్తలకు స్వల్పగాయాలయ్యాయి. కారు ఆపినట్లు ఆపి మళ్లీ అతివేగంగా వచ్చి ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ వద్ద సైకిల్‌పై వెళ్తున్న ఓ వ్యక్తిని, ద్విచక్రవాహనంపై వెళుతున్న మరో వ్యక్తికి ఢీకొట్టడంతో వారు కింద పడ్డారు. కారు అదుపు తప్పి ఓ చెట్టును ఢీకొని ఆగిపోయింది. కారులో బెలూన్స్ సైతం ఓపెన్ అయ్యాయి. పూటుగా మద్యం సేవించి ఉన్న ఓ వ్యక్తి కారులోంచి దిగి అక్కడి నుంచి వెళ్లిపోయినట్లు స్థానికులు చెబుతున్నారు. కారుపై పోలీస్ అని స్టిక్కర్ ఉంది. ఇది పోలీసులకు చెందిన వాహనమా? లేక ఇంకెవరైనా పోలీస్ స్టిక్కర్ అతికించుకున్నారా అనే అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. తాడేపల్లి పోలీసులు గోప్యంగా వివరాలు సేకరిస్తున్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి



మృతి చెందిన భీమిరెడ్డి శ్రీనివాసరెడ్డి

మంగళగిరి టౌన్: గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన సోమవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. సేకరించిన వివరాల ప్రకారం... మంగళగిరి మండలం నిడమర్రు గ్రామానికి చెందిన భీమిరెడ్డి శ్రీనివాసరెడ్డి(50), అతని భార్య సుజాత హైదరాబాద్‌లో ఉంటున్న కుమార్తె వద్దకు వెళ్లేందుకు సోమవారం రాత్రి మంగళగిరి పట్టణ పరిధిలోని తెనాలి ఫ్లై ఓవర్ బ్రిడ్జి కింద బస్సు కోసం వేసి ఉన్నారు. అదే సమయంలో గుర్తు తెలియని తెల్ల రంగు కలిగిన ఓ వాహనం అతివేగంగా భీమిరెడ్డి శ్రీనివాసరెడ్డిని ఢీకొట్టి ఆపకుండా వెళ్లిపోయింది. బలమైన గాయాలు కావడంతో ఆయనను భార్య సుజాత ఎన్ఆర్ఐ ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తీసుకువెళ్లింది. శ్రీనివాసరెడ్డిని పరీక్షించిన వైద్యులు మార్గంమధ్యంలో మృతిచెందినట్లు తెలిపారు. మృతుడి భార్య మంగళగిరి పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసిన పోలీసులు మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం మంగళగిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి దర్యాప్తు చేస్తున్నారు. నిర్లక్ష్యంగా వాహనం నడిపిన డ్రైవర్‌పై చర్యలు తీసుకోవాలని ఆమె కోరింది.

ఉన్నత విద్యారంగం ప్రైవేటు పరం

ఎస్ఎఫ్ఐ జిల్లాస్థాయి సమావేశంలో మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు

లక్ష్మీపురం: భారతదేశంలో ఆర్థిక సంస్కరణ తర్వాత ఉన్నత విద్యారంగంలో అనేక పరిణామాలు చోటు చేసుకున్నాయని మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు అన్నారు. గుంటూరు బ్రాడీపేటలోని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన విస్తృత స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉన్నత విద్యారంగం పెద్దఎత్తున ప్రైవేటీకరణ జరుగుతుందన్నారు. రాష్ట్ర విభజన తరువాత ఆంధ్రప్రదేశ్‌లో 17 ప్రభుత్వ విశ్వవిద్యాలయాలు ఏర్పడ్డాయని, యూనివర్సిటీలో గత 15 ఏళ్లగా రిక్రూట్‌మెంట్ లేకపోవడంతో అకడమిక్ క్షీణత ప్రారంభమైందన్నారు. రాష్ట్రంలోని 280 ఇంజినీరింగ్ కాలేజీలు, 200 ఎంబీఏ, ఎంసీఏ కాలేజీలు, 150 బీ ఫార్మసీ కళాశాలలు ఉన్నాయని.. వీటిలో 90శాతం ప్రైవేట్‌లోనే ఉన్నాయన్నారు. వీటిలో విద్యా ప్రమాణాలపై తనిఖీ యంత్రాంగం లేదన్నారు. ప్రభుత్వ డిగ్రీ కాలేజీల్లో కాంట్రాక్ట్ అధ్యాపకులు పనిచేయటం తగిన మౌలిక వసతులు లేకపోవడం వల్ల చేరే విద్యార్థుల సంఖ్య క్రమంగా తగ్గిపోతుందని, పేద విద్యార్థులు ముఖ్యంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులు ఫీజు రియింబర్స్‌మెంట్ సమస్యలు ఎదుర్కొంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి కె.ప్రసన్నకుమార్ ఎస్ఎఫ్ఐ మాజీ జిల్లా కార్యదర్శి భావనారాయణ ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎం కిరణ్ ,జిల్లా అధ్యక్షులు షేక్ సమీర్, సహాయ కారదర్శి పవన్ కుమార్, యశ్వంత్ కమిటీ సభ్యులు సౌమ్య, అమత, సింధు, హర్షిత, సాహితి, విద్యార్థులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో తండ్రీకుమారులు మృతి



ఫిరంగిపురం: ప్రమాదవశాత్తు జరిగిన రోడ్డు ప్రమాదంలో తండ్రి, కొడుకులు మృతిచెందారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం మేరికపూడి గ్రామానికి చెందిన ఆర్.వెంకటేశ్వర్లు(70), కుమారుడు భార్గవ్(23)లు మంగళవారం ద్విచక్రవాహనంపై పెట్రోలు బంకు వద్దకు బయలు దేరారు. మేరికపూడి గ్రామం వద్దకు చేరుకోగానే గుంటూరు నుంచి నరసరావుపేటకు వెళుతున్న ఆర్టీసీ బస్సు వెనకభాగం ద్విచక్రవాహనం హ్యాండిల్‌కు తగిలింది. దీంతో వాహనం అదుపుతప్పి రహదారిపై పడిపోవడంతో భార్గవ్ అక్కడికక్కడే మృతిచెందాడు. వెంకటేశ్వర్లుకు తీవ్రగాయలు కావడంతో అతడిని చికిత్సకోసం నరసరావుపేట ప్రభుత్వవైద్యశాలకు తరలించి చికిత్స చేస్తుండగా పరిస్థితి విషమించడంతో గుంటూరుకు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. ప్రమాదంపై పోలీసులు కేసునమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.